# తాతగారూ.. కథ చెప్పరూ...!

మంచం మీద కూర్చుని గోడకి దిండు వేసుకొని జార్లబడి పుస్తకం చదువుతున్నా. రాత్రి 9-30 అయింది. ఇంతలో అమూల్య వచ్చి తాతగారూ ఒక కథ చెప్పరూ అని పక్కన కూర్చుంది. పుస్తకం మూసేసి అల్లాగేనమ్మా! అన్నా. నా వళ్లో తలపెట్టుకొని దర్జాగా కాలు మీద కాలేసుకొని - వూ... చెప్పండి అంది మొహం మీద పడ్డ ముంగురులు చేత్తో పైకి తోసుకుంటూ.

అనగనగా ఒక వూళ్లో...

మనవూళ్లోనా తాతగారూ?

అవునమ్మా!

మన వూరు ఎక్కడుంది?

ఇండియాలో... విజయవాడ.

ఓహో! విజయవాడ! అక్కడకి వెళ్లాలంటే విమానం ఎక్కాలా?

అవును. ఇక్కడ విమానం ఎక్కి హైదరాబాదులో దిగి, అక్కడ మళ్లీ ఇంకో విమానమో, రైలో ఎక్కి వెళ్లాలి.

ఆటోలో వెళ్లలేమా?

ఆటోలోనా?...

అవును తాతగారూ... మొన్న మా ఫ్రెండ్ ఇండియా వెళ్లి వచ్చింది. అక్కడ తను ఆటో ఎక్కిందిట. బుల్లి చక్రాల బండి!! మూడే చక్రాలుట.

మధ్యలో సముద్రాలు ఉన్నాయిగదమ్మా. అందుకని విమానంలోనే వెళ్లాలి. విజయవాడలో ఆటో ఎక్కవచ్చు.

నిజమా!! విజయవాడలో ఆటోలున్నాయా?

ఆ... బోలెడన్ని ఉన్నాయి.

తాతగారూ నన్ను ఆటో ఎక్కించరూ!

ఈసారి శలవలకు వెళ్లినప్పుడు తప్పకుండా ఎక్కిస్తా. అంతేకాదు. వేసవి కాలం కనుక మామిడి పళ్లు, ముంజికాయలు, ముంజిలు... ఎన్నో తినవచ్చు.

ముంజికాయలా! అంటే?

అవి తాటిచెట్టుకు గెలలు గెలలుగా కాస్తాయి. ఆ గెలల్ని కిందపడేసి, ఒక్కొక్క కాయనే పైన కత్తితో కోస్తారు. లోపల మూడు కళ్లు ఉంటాయి.

కళ్లా! నిజం కళ్లే??

అబ్బే అవి ముంజిలు. పైకి కళ్లలా కనిపిస్తాయని అల్లా అంటారు. ముంజికాయని కొంచెం కోసి వేలితో కదుపుతూ జుర్రుకుంటూ తింటారు. మధ్యలో నీరు ఉండి చుట్టూ గుంజులా వుంటుంది. నీళ్లు చాలా తియ్యగా ఉంటాయి. గుంజు లేత కొబ్బరిలా ఉంటుంది. కొంతమంది ముంజికాయలు చెక్కేసి, కళ్లను బయటకి తీస్తారు. వాటిని నీటితో సహా తినవచ్చు. ఎంత రుచిగా ఉంటాయో తెలుసా? నిన్న నాకు కాకి ఎంగిలి చేసి పటికబెల్లం ముక్క పెట్టావు చూసా

వా! అంత తియ్యగా ఉంటాయి.

మావయ్యగారూ! అమూల్య నిద్రోతోంది.

లేవతీయబోయా. పక్కకి వత్తిగిలి నా నడుం వాటేసుకుంది.

పోనీలే లక్ష్మీ అలా ఉండనియ్యి. నేను కాస్సేపు అయ్యాక నెమ్మదిగా లేవదీస్తాలే.

బయట మంచు పడుతోంది. రగ్గు పైకిలాగి మెడ దాకా కప్పా.

అమాయకంగా నిద్రోతున్న ఆ పసిదాని కేసి చూస్తూ... వంకుల జుట్టు సవరిస్తూ ఆలోచనలో పడ్డా.

ఏనాటి బంధమో!

* * *

రాత్రి రెండయింది. ఇంకా పడుకోలేదా! ఇక ఆ కంప్యూటర్ని వదలరా ఏమిటి? మా ఆవిడ కేకతో తుళ్లిపడ్డా. అయోమయంగా చూసా. కిటికీలోంచి దూరంగా కనకదుర్గమ్మ వారి గుడి ఎలెక్ట్రిక్ దీపాల కాంతి.

కెనడా నుంచి మనస్సు పూర్తిగా వెనక్కి రాలేదు.

మంచుపడుతున్న శబ్దం వింటున్న భావన పోలేదు.

చేతితో వంకీలు తిరిగిన జుట్టును సవరించిన అనుభూతిలోనే ఉన్నా!! ●




కాలనాథభట్ట వీరభద్రశాస్త్రి